క్లుప్తంగా

జీజీయూలో సెమినార్



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

రాజానగరం: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో ఈ నెల 22, 23 తేదీలలో ఆటోమెటివ్‌లో ప్రత్యామ్నాయ ఇంధనంగా హైడ్రోజన్ ప్రాముఖ్యత అనే అంశంపై జాతీయ సెమినార్ జరగనుంది. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఛాన్సలర్ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ప్రొ ఛాన్సలర్ కె.శశికిరణవర్మ, వీసీ చంద్రశేఖర్ మంగళవారం విడుదల చేశారు.

సెల్ టవర్ వద్దని ఆందోళన



సెల్ టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న వారితో మాట్లాడుతున్న తహసీల్దార్

కోరుకొండ: గ్రామంలోని శివాలయం వెనుక భాగంలో ప్రముఖ సెల్ కంపెనీ టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు ఆందోళన చేపట్టారు. దానిలో భాగంగా మంగళవారం కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతం స్థానికులతో సమావేశాన్ని నిర్వహించారు. సెల్ టవర్ ఉంటే రేడియేషన్ వ్యాప్తి చెంది, స్థానికులకు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని వాపోయారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజల కోరికలను కలెక్టర్ ప్రశాంతికి అందజేస్తామన్నారు. ఈ సమస్యపై ఇటీవల స్థానికులు కలెక్టర్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. తహసీల్దార్‌ని ఆ ప్రదేశం పరిశీలించి, నివేదికను అందించాలని ఆదేశించారు. టవర్ ఏర్పాటు పనులను ఆపాలని, లేదంటే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మందా బాలకృష్ణ, కాపవరపు వెంకటేశ్వర రావు, జి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందించాలని రైతుల ఆందోళన

కోరుకొండ: మెట్ట ప్రాంతంలో వ్యవసాయ సాగుకు ఎరువుల కొరత ఏర్పడింది. ఎరువులు సకాలంలో రైతులందరికీ అందించాలని రైతులు ఆందోళన చేపట్టారు. శ్రీరంగపట్నం సొసైటీలో ఎరువుల కొరతను నివారించాలని రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సొసైటీ పరిధిలో సుమారు 4 వేల మంది రైతులు 3,600 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 80 టన్నుల యూరియా అవశరం ఉండగా, ఇప్పటికి మూడు దఫాలుగా 30 టన్నులు మాత్రమే విడుదలైందన్నారు. మరో 60 టన్నులు యూరియా అవశరమవుతుందన్నారు. చాలిచాలని ఎరువులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రైతులకు ఎరువులు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

వరి పొలాల పరిశీలన



ఏపీత్రయంలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెదపూడి: ఏపీత్రయం గ్రామంలో నీట మునిగిన వరి పొలాలను మంగళవారం పెద్దాపురంలోని డాట్ శాస్త్రవేత్తలు డాక్టర్ శర్మ, డాక్టర్ రామభద్రరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ గ్రామంలో 126 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందన్నారు. ఈ పొలాల్లో నీరు బయటకు వెళ్లడానికి ప్రత్యేక బాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పొలాల్లో నీరు బయటకు వెళ్లిన తర్వాత ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ అఫ్పొటోష్‌ను బూస్టర్ డోస్‌గా వేయాలన్నారు. రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.సత్యప్రసాద్, ఏఈఓ శ్రీనివాస్ గౌడ్, వీఏఏలు దివ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ మృతికి మాజీ ఎమ్మెల్యే సంతాపం

అనపర్తి: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ మృతికి అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, తనకు అత్యంత ఆప్తులైన కన్నబాబు, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు.

సామూహిక ధ్యానం

రంగంపేట: ప్రపంచ శాంతి ధ్యాన సాధనలో భాగంగా రంగంపేట దుర్గమాంబ పిరమిడ్ ధ్యాన మందిరంలో సభ్యులు సామూహిక ధ్యానాన్ని నిర్వహించారు. సొసైటీ అధ్యక్షురాలు ఉండవల్లి భ్రమరాంబిక ధ్యాన సాధనను ప్రారంభించారు. సామూహిక ధ్యాన సాధన చేస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని చెప్పారు.

గట్టెక్కించే ఈ–పంట

- నమోదుతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు
- గ్రామాల్లో జోరుగా ప్రక్రియ
- అనపర్తి నియోజకవర్గంలో 12,338 ఎకరాల్లో పూర్తి
- మొత్తం 47,796 ఎకరాల్లో వరి సాగు



కరకుదురులో రైతుకు ఈ-పంట నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకుడు, ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఏఓ సత్యప్రసాద్

పెదపూడి: ఆరుగాలం శ్రమించే అన్నదాత ఈ–పంట నమోదు చేయించుకోవడంతో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. రైతులు సాగు చేసిన పంటలకు ప్రభుత్వం ఈ–పంట నమోదు చేస్తుంది. దీంతో సంక్షేమ పథకాలను సక్రమంగా అందుకోవాలంటే రైతులు ఈ–పంట నమోదులో తప్పనిసరిగా సాగు వివరాలు నమోదు చేసుకోవాలి. గతంలో మాదిరిగానే ఈ ఏడాదీ ఈ–పంట నమోదులో జియోఫెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ విధానంలో రైతులు, కౌలు రైతులకూ ప్రయోజనం ఉంటుంది.

కచ్చితమైన సమాచారం కోసం..

ఈ ఏడాది కొత్తగా క్షేత్ర స్థాయిలో కచ్చితమైన సమాచారం కోసం ప్రభుత్వం జియోఫెన్సింగ్ విధానంలో రైతు పొలాన్ని గుర్తించేలా 50 మీటర్ల నుంచి 20 మీటర్లకు తగ్గించారు. రైతు పొలం వద్దే వివరాలు నమోదు చేస్తేనే యాప్‌లో నమోదవుతుంది. దీంతో ప్రభుత్వానికి సరైన సమాచారం చేరుతుంది. ఈ–పంట ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతాయి. ప్రస్తుతం వ్యవసాయ సిబ్బంది ఈ–పంట నమోదు కార్యక్రమం ముమ్మరం చేస్తున్నారు.

ఈ–క్రాప్ నమోదు ఇలా..

రైతులు పండించిన పంటలకు అధికారుల ద్వారా ఈ–క్రాప్ నమోదు చేసుకోవచ్చు. పంట నష్ట పరిహారం పొందాలన్నా, ఇతర పథకాలకు అర్హత కావాలన్నా ఈ–పంట నమోదు తప్పనిసరిగా చేయాలి. సచివాలయ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు గ్రామాల్లో రైతుల పొలాలకు వెళ్లి పంట సాగు వివరాలు సేకరిస్తారు. అనంతరం ప్రత్యేక యాప్‌లో రైతులు ఏ రకమైన పంటలు సాగు చేస్తున్నారో గుర్తించి, అక్కడికక్కడే రైతు, పంటను కలిపి ఫొటోను అప్‌లోడ్ చేస్తారు. ఏ సర్వే నంబర్‌లో, ఎంత విస్తీర్ణంలో పంట సాగవుతుందో నమోదు చేస్తారు.

ప్రయోజనాలు

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏ రకమైన పంటలు దెబ్బతిన్నాయో స్పష్టంగా వివరాలు తెలుస్తాయి. దీంతో పంటల బీమా వర్తిస్తుంది. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం అందుతుంది. రైతు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోవచ్చు. సున్నా వడ్డీకే పంట రుణాలు, ఎరువులు, యాంత్రీకరణ పరికరాలు పొందే అవకాశం ఉంది.

నియోజకవర్గంలో..

అనపర్తి నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో అనపర్తి మండలంలో 9 వేల ఎకరాలు, బిక్కవోలులో 14,446, పెదపూడిలో 18,150, రంగంపేట మండలంలో 6,200 ఎకరాల్లో మొత్తం 47,796 ఎకరాల్లో వరి సాగవుతుంది. నియోజకవర్గంలో దాదాపు వరినాట్లు, వెదజల్లు విధానంలో నాట్ల ప్రక్రియ పూర్తయింది. ఈ–పంట నమోదు ప్రక్రియకు సంబంధించి అనపర్తి మండలంలో 2,300, పెదపూడిలో 2,100, బిక్కవోలులో 3,938 రంగంపేట మండలంలో 4 వేల ఎకరాల్లో ఈ–పంట నమోదు పూర్తయింది.

సద్వినియోగం చేసుకోవాలి



ఈ–పంట నమోదు ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ–పంట నమోదును ప్రతి రైతు తప్పనిసరిగా చేయించుకోవాలి. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు ఈ–పంట నమోదు చేస్తారు. ఈ–పంట నమోదు చేయించుకోవడంతో రైతులకు సంక్షేమ పథకాలన్నీ పొందడానికి అవకాశం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టం జరిగినప్పుడు రైతులకు నష్ట పరిహారం పొందడానికి ఉపయోగపడుతుంది.

– ఎస్.సత్యప్రసాద్, మండల వ్యవసాయాధికారి, పెదపూడి మండలం

కుమార సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం భారీగా అభిషేకాలు నిర్వహించారు. శ్రావణ మాసం నాలుగో మంగళవారం ఏకాదశి కావడంతో భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో రామలింగ భాస్కర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిబంధనల మేరకే చవితి ఉత్సవాలు



చవితి ఉత్సవాలపై నిర్వహించిన సమావేశం

సీతానగరం: వినాయక చవితి సందర్భంగా ఈ నెల 27న ఏర్పాటు చేసే మందిరాల వద్ద నిబంధనలు పాటిస్తూ చవితి ఉత్సవాలు జరుపుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో భారతి, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, ఎస్సై రామ్ కుమార్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో చవిత ఉత్సవాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, వినాయకుడి విగ్రహాలు ఐదు అడుగుల మించి ఉండకూడదన్నారు. అలాగే బాణసంచా కాల్చరాదని, మైకులో సౌండ్ ఎక్కువ పెట్టరాదన్నారు. అశ్లీల కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. విగ్రహాల ఏర్పాటుపై దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. వినాయక విగ్రహాలు ప్రతిష్ఠాపన, విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన విషయమై సింగిల్ విండో సిస్టమ్ ద్వారా ఉత్సవ కమిటీ వారు ముందస్తు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ దిశగా విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గోదావరి వరద ఉధృతంగా వస్తున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వివిధ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై సర్పంచ్ ఫిర్యాదు చేస్తే ఉలుకెందుకు?

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: బీసీ సామాజిక వర్గానికి చెందిన పొలమూరు సర్పంచ్ గుడాల ధనలక్ష్మికి జరిగిన అవమానంపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తే బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి అంత ఉలుకెందుకని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 40 ఏళ్లుగా జెండా ఆవిష్కరణ జరుగుతున్న ప్రాంగణాన్ని కాదని, ఉద్దేశపూర్వకంగా సచివాలయం–2 వద్ద సర్పంచ్‌ని ఆహ్వానించకుండా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరగడం వివాదాస్పదమైందన్నారు. ఈ వివాదంపై ఎమ్మెల్యే స్పందించిన తీరు చూస్తుంటే, తప్పు చేసిన అధికారులను వెనకేసుకొస్తున్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ప్రతి చోట ఫొటోలు, వీడియోలు విడుదల చేసిన రామకృష్ణారెడ్డి.. పొలమూరు కార్యక్రమం ఎందుకు దాచారని ప్రశ్నించారు. తప్పును ఆధారాలతో తాము సోషల్ మీడియాలో విడుదల చేయడంతో బెంబేలెత్తిన అధికార పార్టీ నాయకుడు ఈ అంశాన్ని పక్కదారి పట్టించడానికి బీసీ సామాజికవర్గానికి చెందిన కొంతమందిని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులపై పేర్లు వేయించుకోవాలంటే కనీసం 50 శాతం విరాళమిచ్చి ఉండాలన్న ఎమ్మెల్యే.. రామవరంలో సుమారు 13 ఎకరాల ఆలయ భూములపై ఇళ్ల పట్టాలు జారీ చేసిన కాలనీకి ఆయన తల్లిదండ్రుల పేర్లు పెట్టారని, దానికి ఇచ్చిన విరాళం సొమ్ము ఎక్కడుందో చెప్పాలన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా రూ.2 కోట్లతో నిర్మించిన రామవరం ప్రభుత్వాస్పత్రి భవనంపై గతేడాది ఎమ్మెల్యే అయిన రామకృష్ణారెడ్డి అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ తన బంధువుల పేర్లను పెట్టారని గుర్తు చేశారు. దానికి ఇచ్చిన యాభై శాతం విరాళం ప్రభుత్వానికి జమ కాలేదని, అవి ఎక్కడ దాచారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహేంద్రవాడ, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఆర్చిలు, శిలాఫలకాలపై బీసీ సర్పంచ్‌ల పేర్లను వేయకుండా, తన పేరును పెద్దఎత్తున పెట్టించుకోవటం రామకృష్ణారెడ్డి అహంకారానికి నిదర్శనమని తీవ్రంగా విమర్శించారు. తన భార్య ఆదిలక్ష్మిపై ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చేసిన విమర్శలకు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఘాటుగా స్పందించారు. తన భార్య ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, కానీ తన సొంత గ్రామంలో తన తల్లి సర్పంచ్‌గా పోటీ చేసి ఓటమి పాలైనందుకా దేవస్థానానికి చెందిన భూముల కాలనీ ముఖద్వారంపై ఆమె పేరు వేయించుకున్నారా అంటూ వ్యాఖ్యానించారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి జాతర



జాతర సందర్భంగా ఊరేగుతున్న శక్తి వేషధారులు

అనపర్తి: తూర్పు కాపుల ఇలవేల్పు, గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారం రామవరంలో ఘనంగా జరిగింది. శక్తివేషాలు, డప్పులు కోలాహలం మధ్య అమ్మవారి గరగలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి జాతర నేపథ్యంలో వృత్తి రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న స్థానికులు, బంధువులు, స్నేహితుల రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

పైడితల్లి చరిత్ర

తరతరాల క్రితం విజయనగరం పరిసర ప్రాంతాల నుంచి తూర్పు కాపు సామాజిక వర్గీయులు రామవరం గ్రామానికి వలస వచ్చారు. ఇలా గ్రామానికి వచ్చిన వారు సామాజికంగాను, ఆర్థికంగాను పురోగతి సాధించడంతో పైడితల్లి అమ్మవారి చల్లని దీవెనలే కారణమనేది నమ్మకం. క్రమం తప్పకుండా అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. తూర్పు కాపు వర్గీయులే కాకుండా, గ్రామస్తులంతా అమ్మవారి దీవెనల కోసం భక్తిప్రపత్తులతో కొలుస్తారు. గ్రామ దేవతగా భావించి గ్రామస్తుల సహకారంతో నూతన ఆలయాన్ని కూడా నిర్మించారు. అమ్మవారి జాతరకు ఆలయ నిర్వాహకులకు అందరి సహకారం మరువలేనిదని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆదాడి చినసత్యనారాయణ తెలిపారు.

ఆధునిక వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలి



జి.మామిడాడలో దాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు



దాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

పెదపూడి: ఫొటోగ్రఫీ వృత్తిలో వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా ఫొటో, వీడియోగ్రాఫర్లు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జి.మామిడాడ ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘ అధ్యక్షుడు కాకరపల్లి శ్రీను ఆకాంక్షించారు. జి.మామిడాడ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. తొలుత కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ, ఫొటో, వీడియోగ్రాఫర్లు అందరూ ఐక్యతతో ముందుకు సాగినప్పుడే వారి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కోనూరి శ్రీనివాసు, ఆచంట వీరబాబు, జానపాటి సురేష్, కర్రి సత్తిబాబు, మేడపాటి రామకృష్ణారెడ్డి, కర్రి శ్రీనివాసు, కుడిపూడి సాయి రామ్ శేషగిరి, పైడిమళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

బిక్కవోలు: మండల ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం బలభద్రపురం ఆంధ్ర షిర్డీ సాయి కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. నూతన అధ్యక్షుడిగా మరుకుర్తి అశోక్, కార్యదర్శిగా రఘు, ట్రెజరర్‌గా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీను, జాయింట్ సెక్రటరీగా కృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘ కోశాధికారి నామన భాస్కరరావు ప్రమాణం చేయించారు. తొలుత ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్లు పల్లి సతీష్‌రెడ్డి, రమణ, కిరణ్‌ను సత్కరించారు. ముఖ్యఅతిథులు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి సీఐ సుమంత్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పోసిన వీరేంద్రకుమార్, కె.శ్రీనివాసరావు, రంగంపేట, అనపర్తి, పెద్దపూడి, రాయవరం మండలాల ఫొటో, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం

రాజానగరం: మండల ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజానగరంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఫొటోగ్రఫీ పితామహునిగా పేరొందిన లూయిస్ జాక్సిన్ మాండ్ డాగూరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డి.లాజరు, అధ్యక్షుడు చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు శివ, కార్యదర్శి సుందర్, స్టేట్ కమిటీ మెంబర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలపై నిరంతర పోరాటం



సత్యనారాయణరెడ్డిని సత్కరించిన సహచరులు

రాజానగరం: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించుకోవడం కోసం నిరంతర పోరాటం అవసరమని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పాతతుంగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. పీఆర్‌సీ ఇవ్వాలని, డీఏ బకాయిలు చెల్లించాలని, ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులపై పని ఒత్తిడిని తగ్గించాలని సంఘ పరంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం తప్పనిసరిగా ఉండాలన్నారు. 10వ తరగతి వరకు విద్యా బోధన తెలుగులో కూడా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనలు

ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన ఎండీ సత్యనారాయణరెడ్డిని పాత తుంగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కమలాదాస్, సహచరులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు.

పదవులకే వన్నె తెచ్చిన సత్తి వీర్రెడ్డి



రామవరంలో వీర్రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

అనపర్తి: నీటి వినియోగదారుల సంఘ మాజీ అధ్యక్షుడు, సీడీసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దివంగత సత్తి వీర్రెడ్డి ఐదో వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం రామవరంలో ఆయన కుమారులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, విశాఖపట్నం గౌతమి సంస్థల అధినేత సత్తి రామకృష్ణారెడ్డి, వీర్రెడ్డి అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు, అభిమానులు వీర్రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ, వీర్రెడ్డి చేసిన సేవలు ఆ పదవులకు వన్నె తెచ్చాయన్నారు. తనదైన శైలిలో గ్రామ, నియోజకవర్గ రాజకీయాల్లో ప్రత్యేక స్థానం పొందారన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా, అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్ఎస్ మాజీ లైజనింగ్ ఆఫీసర్ పీఆర్‌సీ రావు, స్పీకర్ మాజీ ఓఎస్‌డీ పడాల సత్యనారాయణరెడ్డి, వ్యాపారవేత్తలు కోనాల సోమసుందర రెడ్డి, కోనాల రామకృష్ణారెడ్డి, సత్తి సత్యనారాయణ రెడ్డి, న్యాయవాదులు సత్తి రామారెడ్డి, పట్నాయక్, నల్లమిల్లి బాలకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రామవరం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, రాయవరం మాజీ ఎంపీపీ కోట వెంకట్రావు, మాచవరం సర్పంచ్ కత్తుల అప్పారావు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

కోరుకొండ: బూరుగుపూడి సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని పీఏసీఎస్ అధ్యక్షుడు కంటే నాగకేశవరావు అన్నారు. మంగళవారం స్థానిక సొసైటీ ఆవరణలో త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. చైర్మన్‌గా కంటే నాగకేశవరావు, సభ్యులుగా బాలిన వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి సూర్యనారాయణ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ముగ్గళ్ల సర్పంచ్ గెడ్డం తిమ్మయ్య, వెదుళ్లపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు కరుటూరి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బలభద్రపురం, బిక్కవోలు గ్రామాల్లోని సొసైటీల త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారాలు మంగళవారం జరిగాయి. బలభద్రపురంలో అధ్యక్షుడిగా నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, సభ్యులుగా సింగంపల్లి దేవుడు, మండ సత్యనారాయణరెడ్డితో సీఈవో వెంకటరెడ్డి రామారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే బిక్కవోలులో అధ్యక్షుడిగా పాలచర్ల వెంకట శివప్రసాద్ చౌదరి, సభ్యులుగా కేతా రామకృష్ణ, పోసిన దుర్గాప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



నిందితులు, సారాతో ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: మర్రిపూడి, ఇల్లపల్లి గ్రామాల్లో సారా స్థావరాలపై మంగళవారం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడులు చేశారు. సారా విక్రయిస్తున్న మర్రిపూడికి చెందిన అడ్డాల తాతాజీ, ఇల్లపల్లికి చెందిన ఈలి ముసలయ్యను అరెస్టు చేశారు. వారి నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

రంగంపేట: రాజ్యాంగ పరంగా పౌరుల హక్కులపై అవగాహన పెంచుకోవడంలో విద్యార్థులు చైతన్యవంతులు కావాలని మన హక్కులకై పోరాడు సాధించు ఉద్యమ సంస్థ ఇండియన్ యాక్ట్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ ఉత్తరాంధ్ర రీజినల్ చైర్మన్ కోడి తాతారావు అన్నారు. మంగళవారం చంద్రేడు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గంటా రమణబాబు అధ్యక్షతన సంస్థ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై బ్రోచర్లను సీఆర్‌ఎంటీ శ్రీనివాసరాజు, ఉపాధ్యాయుడు వీరబాబు విడుదల చేశారు. అనంతరం తాతారావు మాట్లాడుతూ, హక్కులు సాధించడంలో పోరాట పటిమను పెంచుకోవాలని కోరారు. పాఠ్యాంశాల్లో ఉన్న చట్టాలతో పాటు, సమాచార హక్కు చట్టం వంటి వాటిపై అవగాహన అవసరమని చెప్పారు. సమాచార చట్టంపై బ్రోచర్లను విద్యార్థులకు పంపిణీ చేశారు.

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణం



వీరభద్రకాళీ సమేత వీరభద్రస్వామివారు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట మంచి నీటి చెరువు వద్ద ఉన్న ఉమా రామలింగేశ్వర స్వామి బాలాలయంలో కొలువైన వీరభద్రకాళీ సమేత వీరభద్ర స్వామివారి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. దివంగత మావిరెడ్డి చంద్రరావు కుమారుడు శ్రీనివాస్ సహకారంతో స్థానిక నీటి సంఘ అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు దంపతులు కల్యాణాన్ని జరిపించారని ఆలయ అర్చకులు మైరవరపు నాగేంద్రకుమార్ తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉండవల్లి జానకిరామ సుబ్బారావు, సుజాత, కమిటీ సభ్యులు ఉండవల్లి వీరవెంకట మాణిక్యం, గిరిబాబు, శ్రీనివాస్, పోతుల వీరసుందరరావు, జమీ, గారపాటి కష్ణమూర్తి, త్రిమూర్తులు, మండవల్లి గుప్తా, కంటిపూడి చిట్టోడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మంగళవారం పూజలు



కొంకుదురులో పూజలు చేస్తున్న మహిళలు

బిక్కవోలు: శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున మహిళలు కాలువలకు వెళ్లి పుణ్య స్నానాలు చేశారు. వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిక్కవోలు, బలభద్రపురం, కొమరిపాలెం, పందలపాక, కొంకుదురు తదితర ఆలయాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ముత్తయిదువులను సాయంత్రం ఇళ్లకు ఆహ్వానించి వాయినాలు అందించారు.

హనుమాన్ చాలీసా పారాయణ

రంగంపేట: హనుమాన్ చాలీసా పారాయణలో మహత్యాన్ని తెలుసుకుని సాధన చేయాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకటఅమర్నాథ్ అన్నారు. మండలంలోని కొత్త కోటపాడులోని ఆరుమిల్లి చంద్రరావు ఇంట్లో శ్రావణ మాసం మంగళవారం సందర్భంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ హనుమ, సత్యసాయి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు.